
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 ; కనిష్ఠం 19.8



5
కామారెడ్డి
జిల్లా వార్తలు
బుధవారం 28 ఫిబ్రవరి 2024

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

దోమకొండ, ఫిబ్రవరి 27: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి గత కొన్ని నెలలుగా వేతనాలు రావడం లేదని వాటిని వెంటనే చెల్లించాలని జీపీ కార్మికులు కోరారు. దోమకొండ గ్రామ పంచాయతీలో సిబ్బంది మాట్లాడారు. ఎస్టీవోలో రెండు నెలలకు సంబంధించిన చెక్కులు ఉన్నట్లు తెలిపారు. తమకు వెంటనే వేతనాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో కూర సంతోష్, నర్సింలు, శివరాజ్, శంకర్, వెంకటి, బాల్‌రాజ్, యాదగిరి, భాస్కర్, గంగధర్, విజయ తదితరులు పాల్గొన్నారు.



మూడున్నరేళ్ల నిరీక్షణకు తెర!

కామారెడ్డి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తులకు త్వరలోనే మోక్షం లభించనుంది. దరఖాస్తులను పరిష్కరించాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఎల్‌ఆర్‌ఎస్ పరిష్కారానికి మూడున్నర ఏళ్ల నిరీక్షణకు తెరపడనుంది. గత మూడున్నర సంవత్సరాల కిందట బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమ ప్లాట్లు, లే అవుట్‌లేని స్థలాలను క్రమబద్ధీకరిస్తామని ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తులు స్వీకరించింది. అయితే ఈ దరఖాస్తుల పరిష్కారానికి మాత్రం గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేకపోయింది. దీంతో ఆయా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు క్రమబద్ధీకరణ కింద రావాల్సిన ఆదాయం రాలేకపోయింది. అయితే ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడడం ఆదాయ వనరులపై సమీక్షిస్తుండడంతో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతోంది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని నిర్ణయించింది. దీనిపై రాష్ట్రప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

జిల్లాలో 30వేలకు పైగా దరఖాస్తులు

జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో మొత్తం 30 వేలకుపైగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని గ్రామ పంచాయతీలలో 10 వేలకు పైగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు రాగా కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో 20వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను పరిశీలించడానికి గతంలోనే సర్వే నెంబర్‌లు, స్థల విస్తీర్ణం ప్రకారం క్లస్టర్‌లుగా విభజించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పట్టణ ప్రణాళికల విభాగాల అధికారులతో బృందాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులంతా ఆన్‌లైన్‌లో రూ.1000 చెల్లించారు. ఇళ్లు కట్టుకోవాలన్న, అమ్ముకోవాలన్న ఇబ్బందులు పడుతున్న వారికి గత ప్రభుత్వం నిర్ణయంతో మేలు చూకూరే అవకాశం ఉంది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇప్పటికే లే అవుట్‌లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు గ్రీన్‌సిగ్నల్ సైతం ఇచ్చింది. జిల్లాలోని గ్రామ పంచాయతీ, మూడు మున్సిపాలిటీల్లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరిస్తే ప్రభుత్వానికి సుమారు రూ.60 కోట్లకు పైగా ఆదాయం

స వ ం క ా రో

- ఎల్‌ఆర్‌ఎస్‌కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- దరఖాస్తులు పరిష్కరించేందుకు ప్రభుత్వ నిర్ణయం
- ఇటీవల ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి
- జిల్లాలో మూడు మున్సిపాలిటీలు, జీపీలలో 30వేలకు పైగా దరఖాస్తులు
- ఎల్‌ఆర్‌ఎస్‌ను పరిష్కరిస్తే సుమారు రూ.60కోట్లకు పైగా ఆదాయం
- అక్రమ ప్లాట్లు క్రమబద్ధీకరించకపోవడంతో స్థానిక సంస్థలకు ఆదాయం దూరం

అవకాశం ఉంది.

రంగంలోకి ప్రత్యేక బృందాలు

జిల్లాలోని మూడు మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీ పరిధిలో 2020లో వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో లైసెన్స్ సర్వేయర్‌లు ఆయా ప్లాట్ల విస్తీర్ణం కొలువడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరగా పరిశీలించి క్లియర్ చేసి ఫీజులు కట్టిన వారికి ఫైనల్ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని నిర్ణయించడంతో రంగంలోకి ప్రత్యేక బృందాలు దిగనున్నాయి. గతంలో మాదిరిగానే బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్‌లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సూపర్‌వైజర్‌లు బృందాలుగా ఏర్పడి ఆయా దరఖాస్తుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదించనున్నారు. దేవాదాయ, వక్ఫ్ బోర్డు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములు, బఫర్‌జోన్‌లోని ప్లాట్లను తిరస్కరించనున్నారు. ఈ తరహా దరఖాస్తులు వందల్లోనే ఉండవచ్చని అధికారులు అంటున్నారు. దరఖాస్తు ఫీజు రూ.1000 కావడంతో చాలా మంది ప్లాట్ల యజమానులు అప్పట్లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున సాధ్యమైనంత తొందరగా క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తులను క్లియర్ చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళ్లనున్నారు.

దరఖాస్తుదారులకు ఊరట

ఎల్‌ఆర్‌ఎస్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు నిర్ణయం తీసుకోవడంతో దరఖాస్తుదారులకు ఊరట లభించనుంది. మూడున్నరేళ్ల కిందట గత ప్రభుత్వంలో లే అవుట్ లేకుండా వెంచర్లు ఏర్పాటు చేయడం, అక్రమ లేఅవుట్‌లు విచ్చలవిడిగా అమ్మకాలు కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వానికి ఆదాయం నిలిచిపోయింది. దీంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు చాలా తగ్గిపోయాయి. ఆదాయం కూడా తగ్గడంతో గత ప్రభుత్వం పునరాలోచించింది. ఆన్‌లైన్‌లో రూ.1000 ఫీజు చెల్లించి లేఅవుట్‌లేని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో పాటు దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ప్లాట్ల క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని ఆదేశించింది. దీంతో లే అవుట్‌లేని ప్లాట్ల యజమానులు ఆన్‌లైన్‌లో వెయ్యి రూపాయలు చెల్లించి దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల రూపేనా ప్రభుత్వానికి కాస్త ఆదాయం సమకూరింది. కానీ లే అవుట్‌లకు పరిశీలించకపోవడంతో ఆయా మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు 33శాతం జరిమానా రూపేనా రావాల్సిన ఆదాయం రావడం లేదు. దీంతో స్థానిక సంస్థలకు ఎల్‌ఆర్‌ఎస్‌తో ఆదాయం సమకూరడం లేదు. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్‌పై వచ్చిన 30వేలకు పైగా దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇస్తే గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపాలిటీలకు భారీగా ఆదాయం సమకూరుతుందని మున్సిపల్, పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు.

పంట నష్ట పరిహారం అందేనా?

- వడగళ్ల వానతో నష్టపోయిన పంటలు
- పది నెలలుగా నిరీక్షిస్తున్న రైతులు
- పరిహారం కోసం ప్రభుత్వంపై రైతుల ఆశలు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 27: పంట చేతికి వచ్చే సమయంలో గత సంవత్సరం మార్చి నెలలో అకాల వర్షాల వల్ల వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. గత ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటలను సర్వే చేయించి రైతుల వివరాలను సేకరించారు. గత ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం అందిస్తామని హామీనిచ్చి రైతులకు ఎలాంటి నష్ట పరిహారం చెల్లించకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా వడగళ్ల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఎల్లారెడ్డి మండలంలో 871 ఎకరాల్లో నష్టం

ఎల్లారెడ్డి మండలంలోని 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల రైతులు గత యాసంగిలో వరి పంటను సాగు చేయగా మార్చి, ఏప్రిల్ నెలలో పంట ఎదిగి చేతికి వచ్చే సమయంలో ఈదురు గాలులు, అకాల వర్షాల కారణంగా వరి పంట నేలవాలి వరి గింజలు నేలపాలయ్యాయని, చేతికందే సమయంలో వడగళ్ల వర్షం తమకు నష్టం చేసిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యా

ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించాలి

● మల్లేష్, రైతు, వెంకటాపూర్



ప్రభుత్వం అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి పది వేలు ఇస్తామని ప్రకటించడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. సర్వే చేశారు కాని నష్ట పరిహారం అందించకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. ఈ ప్రభుత్వమైనా రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

రు. దిగుబడి రాకపోగా పెట్టుబడి చేతికందే పరిస్థితులు దాటి పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి మండలంలో మొత్తం 871 ఎకరాలల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. గత ప్రభుత్వం రైతులకు ఎకరానికి పది వేల నష్ట పరిహారం అందిస్తుందని ప్రకటించడంతో రైతులు కాస్తా ఊపిరి పీల్చుకున్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతీ ఒక్క రైతుకు పంట నష్ట పరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వమే రైతులకు నష్ట పరిహారం అందించాలని రైతుల పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

● అనిల్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి



మండలంలో కురిసిన అకాల వర్షాలకు 871 ఎకరాలల్లో పంట నష్టం జరిగింది. వడగాళ్ల వానకు చాలా చోట్ల వరి గింజలు నేలరాలాయి. వాటి వివరాలను ఉన్నతాధికారులకు పంపాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే రైతుల ఖాతాలో జమ అవుతాయి.



గత సంవత్సరం ఏప్రిల్ నెలలో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

కాంగ్రెస్ పార్టీ అకాల వర్షాల సమయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకునేనా!?

అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్లు వచ్చిన సమయంలో రైతుల పంటలు దెబ్బతినడంతో పరిశీలించడానికి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులకు ఎకరాకు రూ 20వేల పంట నష్ట పరిహారం ఇవ్వాలని గత ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అధికారంలోకి రాగానే రైతుల పంట నష్ట పరిహారాన్ని తక్షణమే అందిస్తామని రైతులకు హామీనిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రైతుల పంట నష్ట పరిహారాన్ని అందిస్తుందేమోనని ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అకాల వర్షాలతో నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారాన్ని అందించేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 27: ఆర్థిక అక్షర్యాసతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం స్థానిక కొత్త బస్టాండ్ నుంచి ఇందిరాగాంధీ స్టేడియం వరకు కొనసాగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ పెంపొందించుకుంటే తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు ఆస్కారం ఉంటుందన్నారు. అదేవిధంగా బ్యాంకులు కల్పిస్తున్న వివిధ పొదుపు పథకాలు, చక్రవడ్డీ, రుణ సౌకర్యాలు, బ్యాంకు సేవలు, డిజిటల్ లావాదేవీలు, సైబర్‌క్రైమ్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ దిశగా ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ భార్గవ్ సుధీర్, జాయింట్ మండల్ లెవల్ బ్యాంకర్ల కమిటీ కన్వీనర్ రవికుమార్, ప్రోగ్రాం అధికారులు చంద్రశేఖర్ గౌడ్, వెంకటేశ్వర్లు, ఆయా బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఎపిక్ నెంబర్‌లు అందించాలి

రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా డేటాబేస్ రూపొందించుటకు ఉపాధ్యాయులు ఎపిక్ నెంబర్లను అందించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. మంగళవారం డీఈవో, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ ఓటరు ఐడీ ఎపిక్ నెం బర్ ఇవ్వడం వల్ల ఎన్ని

బ్యాలెట్ పేపర్లు ముద్రించాలో లెక్కించడంతో పాటు పోస్టల్ బ్యాలెట్ పేపర్‌లను పంపుటకు వీలుంటుందని తెలిపారు. పాఠశాలలో ముందస్తు అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరవుతు న్నారని తమ దృష్టికి వచ్చిందని, ఇక నుంచి పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేయుటకు మండలాల వారీగా సీనియర్ అధికారులను నియమిస్తున్నామని అన్నారు. సెలవులు అవసరమైతే ముందస్తు అనుమతి తీసుకొని వెళ్లాలని, సీనియర్ అధికారుల ఆకస్మిక తనిఖీ లలో ఉపాధ్యాయులు గైర్హాజరు ఉన్నట్లు గుర్తిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్చి 18 నుంచి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వరాదని, సజావుగా, సాఫీగా జరిగేలా చూడాలన్నా రు. ఇందుకు నియమించిన సీఎస్, డీప వో, ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణపై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో రాజు, ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ఇంటర్ పరీక్షలకు.. సర్వం సిద్ధం!

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 27: జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పరీక్షలు రాసే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఆయా పరీక్ష కేంద్రాల్లో హాల్‌టికెట్ నెంబర్లను కేటాయించి పరీక్షలను నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రం చుట్టు పక్కల 144 సెక్షన్ విధించడంతో పాటు జిరాక్స్ సెంటర్లను ఎక్కడికక్కడ మూసివేసేలా చర్యలు తీసుకోనున్నారు. పరీక్షకు గంటముందే చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పరీక్ష కేంద్రంలోకి అరగంట ముందు నుంచే విద్యార్థులను అనుమతించనున్నట్లు ఇంటర్‌నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

- నేటి నుంచి మార్చి 19వ తేదీ వరకు కొనసాగనున్న పరీక్షలు
- ఉదయం 9 గంటల నుంచి పరీక్ష ప్రారంభం
- 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు అనుమతి
- నిమిషం ఆలస్యమైన నో ఎంట్రీ
- జిరాక్స్ సెంటర్లపై నియంత్రణ ఉండేనా?



జిల్లాలో 37 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో మొత్తం 37 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు 55 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 37 మంది డీవోలు, 6 సిట్టింగ్ స్క్వాడ్‌లతో పాటు 2 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 19,509 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం 9,993 మంది ద్వితీయ సంవత్సరంలో 9,516 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 9 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా గంట ముందే పరీక్ష కేంద్రాలకు హాజరై తమకు కేటాయించిన సెంటర్ల వద్ద హాల్ టికెట్ నెంబర్ ఆధారంగా రూం నెంబర్‌ను చూసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తామని నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాలకు అనుమతించరని కావున విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని సూచిస్తున్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్ మీడియట్ బోర్డు అధికారులు నిమిషం నిబంధనను అమలులోకి తీసుకువచ్చారు. పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయంలోగా చేరుకోవాలని సూచించడంతో పాటు అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఇంటర్ అధికారులు, సంబంధిత శాఖధికారులతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలపై చర్చించారు. ఈ పరీక్ష నిర్వహణలో వైద్య, విద్యుత్, పోలీసు, ఆర్టీసీ శాఖ ఉద్యోగులు పాలుపంచుకోనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలే చూడాలని ఉన్నతాధికారులు ఆదేశాలు సైతం ఇచ్చారు.

ప్రతీసారి నిబంధనలను పట్టించుకోని జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు

పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ జరగకూడదనే ఉద్దేశ్యంతో అధికారులు ముందుస్తుగానే జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ జిల్లా కేంద్రంతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ లాంటి ప్రాంతాల్లో నిబంధనలు ఏ మాత్రం లెక్క చేయకుండా ప్రతీసారి పరీక్ష ప్రారంభమైన నిమిషాల వ్యవధిలోనే జిరాక్స్ సెంటర్లను తెరుస్తున్నారు. జిరాక్స్ సెంటర్లను తెరిసి ఉంచినప్పటికీ నియంత్రణ చర్యలు చేట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం పరపాటిగా మారింది. ఈ సంవత్సరమైన జిరాక్స్ సెంటర్ల మూసివేతపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తారా లేక ప్రతీసారి మాదిరి చూసీచూడనట్లు వ్యవహరిస్తారో వేచి చూడాలి.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం

● సలాం, ఇంటర్ నోడల్ అధికారి, కామారెడ్డి

జిల్లాలో నేటి నుంచి జరగనున్న పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాం. మొత్తం 37 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు 19,509 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. నిమిషం నిబంధన అమలులో ఉన్నందున విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలి. అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు పంపుతాం.

ప్రారంభమైన లక్ష్మీ గణపతి ఆలయ మహోత్సవాలు

రుద్రూరు, ఫిబ్రవరి 27: రుద్రూరు మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్స వాలు ప్రారంభమయ్యాయి. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రుద్రూరులోని పలు పురవీధులలో డప్పు వాయిద్యాలతో, మహిళలు మంగళ హారతులతో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. అదే విధంగా యజ్ఞం, హోమం, గోమాత పూజ, ప్రతి ష్ఠాపన చేసే విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బద్దం సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అన్న దాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 28న నిజామా బాద్ వారిచే భజన కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. 29న నిర్వ హించే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాన్సు వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బీబీపాటిల్, ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ ఊరేగింపులో ఆలయ కమిటీ సభ్యులు బాపూరావు, వంజరి గంగాధర్, సుభాష్, కుర్లెం భీంరావు, కాసుల శ్రీనివాస్, వంజరి బాలు, వంజరి భీమ్‌కుమార్, కుర్లెంపవన్, ప్రవీణ్,మహిళలు,భక్తులు పాల్గొన్నారు.



రుద్రూర్‌లో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం

అర్గుల్‌లో ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి27: మండలంలోని అర్గుల్ గ్రామంలో లక్ష్మీ వెంకటేశ్వ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణో త్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారి పల్లకిని ఆలయం నుంచి హనుమాన్ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించ గా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. వేద పండి తులు ఆశ్చర్యతేజ చక్రవర్తుల ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలను నిర్వహి స్తున్నారు. ఈ కార్యక్రమంలో తాజామాజీసర్పంచ్ గోర్త పద్మ, తాజామాజీ ఉపసర్పంచ్ గోర్త రాజేంధర్, వీడీసీచైర్మన్ రాజారెడ్డి, కోశాధి కారి మురళీ, బోర్ర నర్సారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు ఖిల్లా డిచ్‌పల్లికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి రాక

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 27: డిచ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 1985-86 సంవత్సరంలో 10వతరగతి పూర్తి చేసి తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖలో ఇంజనీర్ చీఫ్‌గా పనిచేస్తున్న మోహన్ నాయక్ పాఠశాల విద్యార్థుల కోసం 1లక్ష రూపాయల విలువైన స్కూల్ బ్యాగులు, ప్లేట్లు, వాలీ బాల్స్, హాకీ స్టిక్స్, పరీక్ష ప్యాడులు, పంపిణీ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే డా.రేకుల పల్లి భూపతిరెడ్డి హాజరుఅవుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 10వతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహన ఉంటుందని, ఎమ్మెల్యే హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్‌ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్‌ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్‌ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కారని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్‌ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

చదువుల తల్లికి పుట్టినిల్లు బోధన్

- లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 27: చదువుల తల్లికి పుట్టినిల్లు బోధన్ అని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మీ అన్నారు. బోధన్ పట్టణంలోని ఇందూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడుతూ ఎక్కడెక్కడి నుండో విద్యార్థులు ఇక్కడకు వచ్చి ప్రాథమిక విద్యను అభ్యసించి అనేక రంగాలలో ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారన్నారు. చదువుల తల్లి బోధన్ పుట్టినిల్లు లాంటిదని అభివర్ణించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తులో ఎదుర్కొన్న పెనుసవాళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నా మని పేర్కొన్నారు.విద్యార్థులు సాంకేతిక రంగాలలో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పెట్టాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఇందూర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కొడాలి కిషోర్‌కుమార్, లయన్స్ ప్రముఖులు లయన్ అమర్‌నాథ్ రావు, నరసింహారాజు, మర్రి ప్రవీణ్, లయన్స్ బసవేశ్వరరావు, లయన్స్ శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, సూర్యానారాయణ, లావణ్యలక్ష్మీ, మండల విద్యా శాఖ అధికారి నాగనాథ్, పాఠశాల డైరెక్టర్ కృష్ణారావు, హెచ్‌ఎంఎస్ రామారావు, ప్రైమరీ హెడ్ మాస్టర్ సుధారాణి, అడ్మినిస్ట్రేవ్ ఇన్‌చార్జి స్వాతిలతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎరాజ్‌పల్లిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్, డీపీవో



నర్సరీని పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 27: బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామాన్ని మంగళవారం ట్రైనీ ఐఏఎస్ అధికారిణి కిరణ్మయి, డీపీవో తరుణ్‌కుమార్‌లు సందర్శించారు.ఈసందర్భంగా గ్రామపంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా నర్సరీలను, గ్రామంలోని పలు వార్డులను సందర్శించారు.గ్రామాభివృద్ధి వివరాలు సేకరించారు.ఈకార్యక్రమంలో డీఎల్‌పీవో సాయిబాబా,తహసీల్దార్ గంగాధర్,ఎంపీడీవో వెంకటేష్‌జాదవ్, ఎంపీవో మధుకర్, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హరితహారం మొక్కల పెంపకానికి చలువ పందిళ్లు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 27: నడిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా 3500 మొక్కలు నాటారు. వేసవి తీవ్రత రోజురోజుకు అధికమవుతున్న కారణంగా మొక్కల పెంపకం కోసం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేసి వాటి సంరక్షణకు ఎప్పటికప్పుడు నీటిని అందిస్తూ పంచాయతీ ఈవో కిషన్‌రావు విలేకర్లతో తెలిపారు.

పల్స్ పోలియోపై అవగాహన

మోస్రా,ఫిబ్రవరి27: మోస్రా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెల 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. 0-5సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని, మార్చి 4వ తేదీన ఇంటింటికి తిరుగుతూ పోలియో చుక్కలు వేయాలని ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాయమ్మ, ఏఎన్‌ఎం తనూజ, భాగ్య, బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మళ్లీ కుట్ర రాజకీయాలు చేస్తోంది

- బీజేపీ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

భీమ్‌గల్ రూరల్, ఫిబ్రవరి27: బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకటే అంటూ తప్పుడు ప్రచారంతో మళ్లీ కాంగ్రెస్ గెలవాలని చూస్తుందని, లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కాగ్రెస్ పార్టీ కుట్ర పూరిత రాజకీయాలు చేస్తుందని, రాహుల్ గాంధీకి ప్రధాని అయ్యే అవకాశం లేదని బీజేపీ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మంగళవారం భీమ్‌గల్ మున్సిపాలిటీలో బీజేపీ విజయ సంకల్పయాత్ర బస్సురోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తోనే దేశం అభివృద్ధి పథంలో ముదుంకు వెళ్తుందని, కరోనా కష్ట కాలంలో నేనున్నాని ప్రతి పేదవాడికి గుర్తుంచుకునేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముందుండి నిలబడ్డాడని అన్నారు. తెలంగాణాలో సావుతప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అబద్దాల ఆరుగ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి గెలిచారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అర్వింద్ కమలం పువ్వుకు ఓటువేయాలని అన్నారు.ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి,నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ,ఎంపీ ధర్మపురి అర్వింద్,పెద్దోళ్లగంగారెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్ బీజేపీ సంకల్ప రథయాత్రకు మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. మంగళవారం మోర్తాడ్‌కు విచ్చేసిన రథయాత్రకు స్వాగతం పలికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె.అరుణ, ఎంపీ ధర్మపురి అర్వింద్, నిజామాబాద ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణగుప్తా స్థానిక మండల నాయకులు స్వాగతం పలికి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ బీజేపీ ఇన్ చార్జీ ఏలేటి మల్లి కార్జున్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్ కుల చారి, జిల్ల నాయకులు, మండల బీజేపీ అధ్యక్షులు పుప్పాల నరేష్, బోగ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: దేశ ప్రజల, రైతుల, మహిళల అన్నివర్గాల అభివృద్ధి కోసం నరేంద్రమోదీ దేశాన్ని ప్రణాళికబద్ధంగా 2047 కల్ల వికసిత్ భారత్ సంకల్పంతో భారత దేశాన్ని ప్రపంచదేశా అభివృద్ధి చెందిన దేశాల్లో మొట్టమొదటిదేశంగా నిలపడానికి ప్రధాని నరేంద్రమోదీ కృషిచేస్తున్నారని ఈసారి ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు తెలపాలని బీజేపీ జాతీయఅధ్యక్షురాలు, మాజీ మంత్రి డికే అరుణ అన్నారు. కేంద్రమంత్రి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పాలమూరు పార్లమెంట్ నుంచి ప్రారంభించిన విజయ సంకల్పయాత్ర మంగళవారం జిల్లా సరిహద్దులోకి ప్రవేశించగా బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు దినేష్ కులచారి, పల్లె గంగారెడ్డి, పలువురు బీజేపీ జిల్లా, మండల నాయకులు గండిహనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, వివిద గ్రామాల పార్టీ శ్రేణులు మహిళలు పాల్గొన్నారు.

సిరికొండ: విజయ్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలో నిజామాబాద్ ఎంపీ దర్మపురి అరవింద్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీ.కె అరుణ ఎమ్మెల్యేలతో కలిసి రోడ్ షో నిర్వహించారు. వాల్గోట్ గిర్ని వద్ద నూతనంగా ప్రతిష్ఠించిన ఎల్లమ్మ తల్లిని ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా దర్శించుకుని పూలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్, మండల నాయకులు రంజిత్‌రెడ్డి, గంగమురళి, సంద్ర శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తాం

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మాక్లూర్, ఫిబ్రవరి27: గిరిజనులు ప్రకృతితో మమేకం అవుతూ ఉపాధి పొందుతారని వారి అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కల్లెడి గ్రామంలో సంత్‌సేవలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండా మహిళలు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. సేవలాల్ మహరాజ్ విగ్రహానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి రాకేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తండాలలో రోడ్లు, డ్రైనేజీలు సకల సౌకర్యాలు ఉండేలా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం మండలంలోని మామిడిపల్లి గ్రామశివారులో గల అపురూప వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అనాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పందులకు స్వైన్‌ఫ్లూ టీకాలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి27: పట్టణంలోని వెటర్నరీ ఆసుపత్రి పరిధిలో మంగళవారం వెటర్నరీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ జీయావుద్దిన్ పందులకు స్వైన్‌ఫ్లూ టీకాలను వేశారు. కొన్ని రకాల వ్యాధుల వల్ల పందుల నుంచి మనుషులకు వచ్చే అవకాశం ఉన్నందున 98పందులకు స్వైన్‌ఫ్లూ టీకాలు ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యాధి నిర్ధారణ కేంద్రం నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ బస్వారెడ్డి వచ్చి పశువుల నుంచి వివిధ రకాల వ్యాధుల నిర్ధారణ కొరకు రక్తనమూనాను సేకరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రోజశ్రీ, పవన్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తప్పవు

ముప్కాల్, ఫిబ్రవరి27: నిబంధనలకు విరుద్ధంగా రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై భాస్కరచారి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో తరచు ప్ర మాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆరుగాలం కష్టపడి కష్టించే రైతు పెట్టుబడి సాయం కోసం చూడలే తప్ప ప్రమాదాలకు కారణం కావొద్దని ఆయన సూచించారు. పదేపదే నోటీసులు ఇచ్చినప్పటికీ రైతులు మానడంలేదని, రోడ్డుపై యదేచ్ఛగా పంట నూర్పిళ్లు, ధాన్యం ఆరబోత సరైందికాదని పేర్కొన్నారు. ప్రమాదాలకు కారణమైన సంబంధిత రైతులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ధర్మారం(బి) గురుకుల పాఠశాలలో హాల్ టికెట్ నంబర్లు వేయిస్తున్న సిబ్బంది

కోటగిరి,ఫిబ్రవరి27: కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని కళాశాల సీఎస్ రిజ్వానా సమీర్ తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 208మంది విద్యార్థులు, వొకేషనల్ విభాగంలో 44మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 179మంది విద్యార్థులు, వొకేషనల్‌లో 45మంది విద్యార్థులు పరీక్ష రానున్నారని ఆమె తెలిపారు. విద్యార్థులు 8గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు. ఒక్క నిమిషం ఆలస్యం అయిన విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించబోమని పేర్కొన్నారు.

డిచ్‌పల్లి: నేటి నుంచి ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలు ప్రారం భం కానున్నాయని నిర్వహకులు తెలిపారు. డిచ్‌పల్లి మండలంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చీఫ్ సూపరింటెండ్ అధికారులు తెలిపారు. ప్రభుత్వ జూనియన్ కళాశాలతో పాటు ఎస్‌పీఆర్ కళాశాల, ధర్మారం(బి) గురుకుల కళాశాల, మోడల్ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయ నున్నారని ఇందుకోసం పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సూపరిం డెంట్ తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కోరారు. ధర్మారం గురుకుల పాఠశాల 355 విద్యార్థులు, ఆదర్శపాఠశాల డిచ్‌పల్లి 392మంది, విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని వారు పేర్కొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దృశ్యం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 27: బోధన్‌లో బీఆర్‌ఎస్‌కు వరుసగా భారీ షాక్‌లు తగులుతున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. మంగళవారం బోధన్ మండలం కల్దుర్కి సొసైటీ చైర్మన్, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ శరత్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండు వా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెర వేర్చడంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందన్నారు. రూ.500కేగ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత కరెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఎన్ని కల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలుచేస్తామన్నారు.ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు,సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనా ర్ధన్,సిద్ధాపూర్ సర్పంచ్ అశోక్‌పటేల్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్‌రాజాగౌడ్ తదితరులు ఉన్నారు.

జాకోర విండో ఉపాధ్యక్షుడిపై వీగిన అవిశ్వాసం

వర్ని,ఫిబ్రవరి27: వర్ని మండలం జాకోర విండో ఉపాధ్యక్షులు గఫర్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లా సహకార అధికారి ప్రకటించారు. గఫర్‌పై అవిశ్వాసం పెట్టడంతో ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంకు ఒక్క సభ్యుడు కూడా హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగినట్లు వెల్లడించారు.

కన్నుల పండువగా రేణుకా ఎల్లమ్మ-జమదగ్నిల కల్యాణం

భిక్కనూరు, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం రేణుకా ఎల్లమ్మ-జమదగ్నిల కల్యాణాన్ని గౌడ సంఘం ప్రతినిధులు కన్నుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించి ఆలయ ప్రాంగణంలో ఎల్లమ్మ-జమదగ్నిల కల్యాణాన్ని వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి కల్యాణం అనంతరం మహిళలు అమ్మవారికి ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకోగా, ఆలయ ప్రాంగణంలో గౌడ సంఘం ప్రతినిధులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రామన్ని నిర్వహించారు. అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


భిక్కనూరులో రేణుకా ఎల్లమ్మ కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ముత్యంపేటలో రేణుకా ఎల్లమ్మకు బోనాలు

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామంలో రేణుకాదేవి ఆలయ 60వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రేణుకా ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. రాత్రి 8 గంటల నుంచి శ్రీ సింగరాయపల్లి అంజయ్య శిష్యుల బృందంచే శ్రీ రేణుకా ఎల్లమ్మ ఒగ్గుకథ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్తగారి శిరీష్‌గౌడ్, సభ్యులు చిన్నపోశగౌడ్, ఎ. స్వామిగౌడ్, యం. మోహన్‌గౌడ్,యం. సిద్దాగౌడ్, యం. గోపాల్ గౌడ్, స్వామిగౌడ్, బి. శ్రావణ్‌గౌడ్,యం. సాగర్‌గౌడ్, బి. ప్రసాద్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

రేణుక మాతా ఆలయంలో కుంకుమార్చన

నిజాంసాగర్: మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని రేణుకా మాత ఆలయంలో మంగళవారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, ఓడి బియ్యం, కుంకుమార్చన కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు. గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రతీ యేడు లాగే ఈ సంవత్సరం కూడా బోనాల పండుగను ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకుంటూ ఘనంగా జరుపుకున్నామన్నారు.

సేవాలాల్ జయంతిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం


సేవాలాల్ ఉత్సవాల నుంచి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, ఫిబ్రవరి 27: బాన్సువాడ పట్టణంలోని మీనా గార్డెన్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదంతో సభ రసాభాసగా మారింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఇద్దరూ నేతలు కూడా ఒకే వేదికపై పాల్గొన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగును వేదికపైకి ఆహ్వానించడంతో కాంగ్రెస్ నాయకులు కేరింతలు వేయడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. బంజారా జిల్లా అధ్యక్షుడు బద్యానాయక్, ప్రతాప్ సింగ్‌ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని చివరకి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మధ్యలో నుంచి వెళ్లిపోయారు. దీంతో చివరకు ఏనుగు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు.

కార్యక్రమానికి పిలిచి అగౌరవపర్చడం బాధాకరం

బాన్సువాడ పట్టణంలోని మీనా గార్డెన్‌లో మంగళవారం అధికారికంగా నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు నాయకులను కార్యక్రమానికి పిలిచి అగౌరవపర్చడం బాధాకరమని జిల్లా బంజార సేవా సంఘం అధ్యక్షుడు బద్యానాయక్ తెలిపారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ జయంతిని ఈ సంవత్సరం కాంగ్రెస్ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహిస్తామని చెప్పి సమానత్వం చూపకపోవడంతో పాటు, అహంకార ధోరణితో అగౌరవపర్చారని ఆయన మండిపడ్డారు.

నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్

అధ్యక్షుడి ఎన్నికపై హైకోర్టు స్టే

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 27: నాగిరెడ్డిపేట మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహణపై మంగళవారం హైకోర్టు స్టే విధించినట్లు తెలుస్తోంది. ఈనెల 28వ తేదీన బుధవారం 11 గంటలకు నాగిరెడ్డిపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడి ఎన్నిక జరగాల్సి ఉంది. కాగా ప్రస్తుతం నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్న దివిటీ రాజ్‌దాస్ మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహణపై హైకోర్టును ఆశ్రయించారు. దీంతో బుధవారం జరగాల్సిన మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించకూడదంటూ హైకోర్టుస్టే విధించినట్లు తెలుస్తోంది. హైకోర్టు స్టే విధించినట్లు తెలుస్తుండటంతో బుధవారం జరగాల్సిన నాగిరెడ్డిపేట మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడి ఎన్నిక వాయిదా పడే అవకాశముందని తెలుస్తోంది.

ఉపాధి హామీ పనుల పరిశీలన

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), ఫిబ్రవరి 27: మహ్మద్‌నగర్ మండలంలోని గాలిపూర్ గ్రామ శివారులో పెద్ద గట్టు కుంటలో మంగళవారం ఉపాధిహామీ పనులు చేపట్టారు. ఊట కుంటల పనులు చేపట్టారు. చెరువులో మట్టిని తవ్వి కట్టకు పోస్తుండగా టెక్నికల్ అసిస్టెంట్ బాల్‌సింగ్ పరిశీలించి, కొలతలు తీసుకుని కూలీల హాజరును పరిశీలించారు. గ్రామాల్లో నీరు నిల్వ ఉంటూ భూ గర్భజలాల పెంపు కోసం ఊట కుంటల పనులు చేపడుతున్నామన్నారు. ప్రతీ కూలీకి గిట్టుబాటు కూలీ వస్తుందన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ రాములు, తదితరులున్నారు.

బంగారు పోచమ్మ ఆలయ పోస్టర్ల ఆవిష్కరణ

బాన్సువాడ, ఫిబ్రవరి 27: పట్టణంలోని బీడీ కార్మికుల కాలనీలోని బంగారు పోచమ్మ ఆలయ 8వ వార్షికోత్సవ కరపత్రాలను మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మార్చి 5న మంగళవారం అమ్మవారికి అభిషేకాలతో ప్రారంభించి వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అధికారులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 246 పోలింగ్ బూత్‌ను సెక్టార్ అధికారి నారాయణ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద వసతులు బూత్ లెవల్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు జరిగే నేపథ్యంలో పోలింగ్ బూత్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, బీఎల్‌వో రేఖ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలి

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), ఫిబ్రవరి 27: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటిస్తూ సక్రమంగా నడిపించాలని సూపర్‌వైజర్ రాజేశ్వరీ అన్నారు. సోమవారం మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో నిర్వహించిన సెక్టార్ సమావేశంలో మాట్లాడారు. ప్రతీరోజు మెనూ ప్రకారం బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. పాలు, గుడ్లు తప్పకుండా అందించాలన్నారు. రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ నమోదు, వివరాలను పక్కాగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ కట్టడాలను తొలగించండి'

మద్నూర్, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరం నుంచి పాత బస్టాండ్ వరకు అక్రమంగా రోడ్డుపై వేసిన కట్టడాలను తొలగించాలని గ్రామస్థులు మద్నూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతీ ఏడాది మందిరం నుంచి రథం ఊరేగింపు ఉంటుంది. రథం తిరిగే ప్రాంతాల్లో రోడ్డుపై ఉన్న కట్టడాలను తొలగించాలని ఫిర్యాదు చేశారు. ఈ విషయమై జిల్లా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఈవో సందీప్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

మొక్కజొన్నలో చీడపీడలపై జాగ్రత్తలు పాటించాలి

పిట్లం, ఫిబ్రవరి 27: పంటలపై చీడపీడలపై బెడద ఉంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిని భాగ్యలక్ష్మీ అన్నారు. మంగళవారం కంబాపూర్ గ్రామంలో వరి, మొక్కజొన్న పంటలను జిల్లా అధికారి పరిశీలించారు. రైతుల పంట పొలాల వద్దకు వెళ్లి పంటలను పరిశీలించి, పంటల సాగు విధానం, దిగుబడి, అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి కిషన్, ఏఈవో ప్రదీప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మాగిలో అగ్ని ప్రమాదం

నిజాంసాగర్: మండలంలోని మాగి గ్రామంలో రాజం సాయిలుకు చెందిన గడ్డి వాము మంగళవారం వేకువ జామున దగ్ధమైంది. దీంతో సుమారు రూ.40వేల ఆస్తి నష్టం జరిగింది. పక్కనే గల మామిళ్ల రామవ్వకు చెందిన ఇంటికి నిప్పు అంటుకుని ఇంట్లో ఉన్న బియ్యం, పప్పులు, వంట సామగ్రి, బట్టలతో పాటు ఫర్నిచర్ సైతం కాలిపోయాయి. దీంతో సుమారు రూ.లక్షా 10వేల ఆస్తి నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న ఆర్ఐ అంజయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలించి, పంచనామా నిర్వహించారు. వారి వెంట మాజీ సర్పంచ్ అంజయ్య, నాయకులు సాయిలు తదితరులున్నారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

సదాశివనగర్, ఫిబ్రవరి 27: మాదకద్రవ్యాల జోలికి ఎవరూ వెళ్లొద్దని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అమృత రాజేందర్‌రావు తెలిపారు. మంగళవారం మండల సమాఖ్య సమావేశంలో మానవ అక్రమ రవాణా, సామాజిక మాధ్యమాల వల్ల ఎదురవుతున్న సమస్యలు, మాదకద్రవ్యాల వినియోగం, యువత, ప్రజలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు అంశాలపై సమావేశంలో పాల్గొని అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఒకప్పుడు పట్టణాలకు పరిమితం అయిన మాదకద్రవ్యాల వినియోగం నేడు గ్రామాలకు విస్తరించిందని అన్నారు. ఈ వ్యసనాల వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. విద్యార్థులు తెలిసీ తెలియని వయస్సులో ఆకర్షణ, ఆనందం వ్యామోహంలో ఉండి వారి జీవితాలను ఇతర వ్యక్తులకు తాకట్టు పెడుతున్నారని తెలిపారు. ఎక్కువ సమయం సామాజిక మాధ్యమాల్లో గడపకుండా చదువుపై దృష్టి సారించేలా చూడాలని తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక పర్యవేక్షణ అవసరం అని సూచించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు శోభ, ఏపీఎం రాజారెడ్డి, సంస్థ ప్రతినిధులు విఠల్‌రావు, వివిధ గ్రామాల అధ్యక్షులు, సీసీలు ఆంజనేయులు, నరేందర్, లింగం తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భవన నిర్మాణ కార్మికుల

సమస్యలను పరిష్కరించాలని ధర్నా

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 27: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం తెలంగాణ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని కార్మిక శాఖ సహాయ అధికారి కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల కూతురు పెళ్లికి ఇస్తున్న రూ.30వేలను రూ.లక్షకు పెంచాలని, సహజ మరణంకు ఇస్తున్న రూ.లక్షను రూ.3లక్షలకు పెంచాలని, కార్మికుడి అంత్యక్రియలకు రూ.30వేల నుంచి రూ.50వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్మికశాఖ జూనియర్ అసిస్టెంట్ సతీష్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, రాములు, లక్ష్మణ్, సాయిలు, గంగామణి, కవిత, సాయిబాబా తదితరులున్నారు.


అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు


మానవ శరీరంలోని అంశాలను వివరిస్తున్న విద్యార్థి

విద్యార్థులు విజ్ఞానం వైపు అడుగులు వేయాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 27: విద్యార్థులు విజ్ఞానం వైపు అడుగులు వేయాలని సీఎస్ఐ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆమోస్ అన్నారు. మంగళవారం అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు పలు విజ్ఞాన అంశాలపై వివరించడంతో పాటు వారితో కలిసి సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివరించే పలు అంశాలను ఉపాధ్యాయులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానంతోనే ప్రతీ అంశాన్ని కూలంకుశంగా తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. నిత్య జీవితంలో మనం ఉపయోగించే ప్రతీ వస్తువు సైన్స్ అనే అంశంతో ముడిపడి ఉంటుందని అలాంటి అంశాలను పూర్తిస్థాయిలో విద్యార్థులకు వివరించేందుకు అగస్త్య ఫౌండేషన్ ముందుకు రావడం గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులు చదివి నేర్చుకునే దానికంటే ఆయా అంశాలను చూసి అర్థం చేసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది నాగశ్రీ, మంజుల, భవ్య, అనురాధ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

రాజంపేట, ఫిబ్రవరి 27: మండలంలోని గుండారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విజయస్ఫూర్తి కార్యక్రమం ద్వారా 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ఎంపీటీసీ హాజీనాయక్, నడిమితండా మాజీ సర్పంచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో హెల్పింగ్ బ్రిడ్జ్‌ఫర్ ఎడ్యుకేషన్స్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు పరీక్షల సమయంలో భయపడకుండా పరీక్షలు బాగా రాయాలని పుట్టిన గ్రామానికి చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రతీ విద్యార్థి ప్రణాళికలతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణాకర్‌రావు, సాయిలు, సోమయ్య, ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఉపాధి హామీ పనుల పరిశీలన

రాజంపేట, ఫిబ్రవరి 27: రాజంపేట మండలంలోని శేర్‌శంకర్‌తండా, ఎల్లారెడ్డిపల్లి తండా గ్రామాల్లో మంగళవారం ఉపాధి పనులను, నర్సరీలను పరిశీలించినట్లు ఎంపీడీవో రాజేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు చేసే కూలీలకు రోజువారిగా రూ.272 కూలి పడేవిధంగా వారికి అవగాహన కల్పించడం జరిగిందని నర్సరీలకు సంబంధించి 100 శాతం మొక్కలు పెరిగే విధంగా చూసుకోవాలని అన్నారు. ఎక్కడైతే మొలకలు రాని బ్యాగులో మళ్లీ విత్తనాలు నాటాలని ఎండల తీవ్రత పెరగడంతో ఉదయం 8 గంటల లోపు సాయంత్రం 6 గంటల తర్వాత ప్రతిరోజూ తప్పనిసరిగా నీరు పట్టాలని సూచించారు. ఎవరైన మొక్కల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో టీఏ భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు రమేష్‌గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 27: కామారెడ్డి పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం లేబర్ అడ్డ వద్ద గుర్తు తెలియని మగ వ్యక్తి కదలలేని స్థితిలో పడి ఉండగా 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని తెలిపారు. సదరు వ్యక్తి మృతదేహాన్ని మార్చురి గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. గత కొన్ని రోజుల నుంచి షాపుల వద్ద భిక్షాటన చేస్తూ ఉన్నట్లుగా తెలిసిందని ఎవరైన ఈ వ్యక్తి యొక్క వివరాలు తెలిసినచో కామారెడ్డి పట్టణ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిన

ట్రాక్టర్ డ్రైవర్ యూనియన్ నాయకులు

బీర్కూర్, ఫిబ్రవరి 27: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన 30 మంది ట్రాక్టర్ డ్రైవర్ యూనియన్ నాయకులు మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చందు, బస్వరాజ్, యామ రాములు, క్యాకప్ప, బ్రహ్మయ్య, బండ సాయిలు, భాస్కర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

లైంగిక, అంటువ్యాధులపై అవగాహన సదస్సు

భిక్కనూరు, ఫిబ్రవరి 27: మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో మంగళవారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో హెచ్ఐవీపై, లైంగిక, అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్ర ప్రతిష్టాత్మకంగా ఈ శిక్షణను అన్ని జిల్లాల్లో నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని యువతి, యువకులందరికీ ఈ విషయాల పట్ల అవగాహన తప్పనిసరిగా ఉండాలని, ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం హెచ్ఐవీ నియంత్రణ అధికారి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ తరహా వ్యాధుల నివారణకు ఎన్నోచర్యలు చేపట్టిందని,ప్రజలకు అందుబాటులో కండోమ్స్, ఇతర రక్షణ జాగ్రత్తల వివరాలతో కూడిన ప్రచారం చేస్తుందని దానిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌గౌడ్, ఎన్ఎస్ఎస్ పీఓ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 27: కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహన మానసిక వైద్య నిపుణులు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రమణ మాట్లాడుతూ రోజువారి దినచర్య, పరీక్ష ప్రణాళికనుగుణంగా చదువుకోవడంలో మార్పులు, పరీక్ష సమయంలో ఒత్తిడికి గురికావడం, పరీక్షల్లో ఫెయిల్ అయినప్పుడు ఆత్మహత్య ప్రేరేపిత ఆలోచనలు అధిగమించాల్సిన తీరు, ఒంటరితనం లేకుండా ఉండటానికి, భ్రమల్లో గడపకుండా ఉన్నవి లేనట్లు, లేనివి ఉన్నట్లు ఊహించుకోవడం లాంటి విషయాలపై కూలంకుశంగా వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీరబ్రహ్మం, దయానంద్, ప్రసన్న లత, శ్రీపాద, పవన్‌కుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త

భగలాముఖి క్యాలెండర్ ఆవిష్కరణ

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 27 : భగలాముఖి అమ్మవారు పీఠం క్యాలెండర్‌ను మంగళవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి పీఠం చాలా శక్తి వంతమైందన్నారు. ఈ కార్యక్రమంలో పీఠం వ్యవస్థాపకులు క్రాంతి పటేల్, భక్తులు రేవంత్ అప్ప, లక్ష్మీనారాయణ, సతీష్, మధు, శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.


స్టేడియం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

క్రికెట్ స్టేడియానికి స్థల పరిశీలన

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 27: పట్టణంలోని పాత బాన్సువాడలో మంగళవారం బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి నాయకులతో కలిసి క్రికెట్ స్టేడియం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్ రాథోడ్, నందు పటేల్, పాత బాలకృష్ణ, నార్ల రాఘవేందర్, నాగరాజు, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

ఫ్లెక్సీ చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

బీర్కూర్, ఫిబ్రవరి 27: నసురుల్లాబాద్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీని చింపజేశారని మంగళవారం నసురుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై లావణ్యకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఫ్లెక్సీ చింపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షులు సున్నం సాయిలు, మేకల రామన్న, అనసూరి శ్రీనివాస్, కంది పెద్ద మల్లేష్, గోపి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బెంచీలు పంపిణీ చేస్తున్న ఎల్లారెడ్డి

విద్యార్థులకు బెంచీల పంపిణీ

తాడ్వాయి, ఫిబ్రవరి 27:తాడ్వాయి మండలం సోమారం గ్రామంలో మంగళవారం జపాన్ శాస్త్రవేత్త ఎల్లారెడ్డి విద్యార్థులకు బెంచీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద పిల్లలకు సేవ చేయాలనే సంకల్పంతోనే బెంచీలు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - హనుమాన్
శాంతి - ఊరు పేరు భైరవకోన
ప్రియా 70 - ఈగల్
ప్రియా 35 - సిద్ధార్థరాయ్

బాన్సువాడ

మహేశ్వరి - ఊరు పేరు భైరవకోన
వెంకటేశ్వర - హనుమాన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

